ప్రభాతనవ
SINGIDI
తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
సోమవారం 15 జూన్ 2026
సంపుటి: 1 సంచిక: 3 పేజీలు 8 వెల: 4

## ఇన్నోవేషన్ భారత డీఎన్ఏలోనే ఉంది

**'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' ఆగదు.. కొనసాగుతూనే ఉంటుంది**

ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందించే స్థాయికి భారత్ ఎదిగింది: మోదీ

ఫ్రాన్స్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక 'భారత్ ఇన్నోవేట్స్' సదస్సులో ప్రధాని మోదీ

2



Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar Adilabad



దేశానికి వెలుగులు అందిస్తున్న

## సింగరేణి కార్మికులు

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**మంచిర్యాల, జూన్ 14 (సింగిడి)**

సింగరేణి కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి వెలుగులు అందిస్తున్నారని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ సందర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమానికి రాష్ట్ర ఐ.టి., ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శాసనమండలి సభ్యులు దండే విఠల్, సింగరేణి సి ఎం డి బుద్ధ ప్రకాష్ జ్యోతి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,

...మిగతా 2లో

## తెలంగాణలోనూ ఓట్ చోరీ..

అప్రమత్తమైన కాంగ్రెస్

ఎస్ఐఆర్‌ని కాంగ్రెస్ పార్టీ సీరియస్‌గా తీసుకున్నది. ఎస్ఐఆర్‌పై ఆదివారం కాంగ్రెస్ నాయకులకు ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

- హైదరాబాద్, జూన్ 14 (సింగిడి)

2

వర్షాల నేపథ్యం... అధికారులపై

# సీఎం సీరియస్

## వర్షాలు, ప్రకృతి విపత్తులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

### వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం

ప్రాజెక్టుల నిర్వహణ మాన్యువల్ ప్రకారం జరగాలని ఆదేశాలు

వర్షాల సమయంలో అధికారుల మధ్య సమన్వయ లోపం, విధుల్లో నిర్లక్ష్యంపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. ముందుగా సూచనలు చేసినప్పటికీ.. అధికారులు సరైన చర్యలు చేపట్ట లేదని ఆగ్రహించారు. వర్షాలు, ప్రకృతి విపత్తుల నిర్వహణపై అధికారులకు మరోసారి కీలక సూచనలు చేశారు. కిందిస్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారి వరకు అందరూ వర్షం పడినప్పుడు రోడ్డుపైకి రావాలని.. అవసరమైతే తానే రోడ్డుపైకి వస్తానని తేల్చి చెప్పారు.

- హైదరాబాద్, జూన్ 14 (సింగిడి)





వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టుల దగ్గర పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్వహణ మాన్యువల్ ప్రకారం జరగాలని, ప్రాజెక్ట్ ల సీఈలు , ఎస్.ఈలు ఈ సీజన్‌లో స్థానికంగా ఉండాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇంజినీర్లు ప్రాజెక్టులు వదిలి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎం.సీ.ఆర్.హెచ్.ఆర్డీ బోధీ పెవిలియన్ లో వర్షాలు, ప్రకృతి విపత్తులపైన ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, డీజీపీ సి.వి. ఆనంద్, ఇరిగేషన్, మెట్రో వాటర్ బోర్డు, ఆర్.డబ్ల్యూ.ఎస్ కార్యదర్శులు, కమీషనర్లు, ముఖ్య అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల మెయింటెన్స్,గేట్ల మరమ్మతులకు నిధులను తక్షణమే నిధులు విడుదల చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వర్షం సమయంలో ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి కింద స్థాయి సిబ్బంది వరకు రోడ్ల పైన ఉండాల్సిందే అని అవసరం అయితే తాను కూడా రోడ్ల పైకి వస్తానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వర్షం వల్ల ట్రాఫిక్ జామ్ అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇరిగేషన్,మెట్రో వాటర్ బోర్డు, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు సమన్వయంతో పని చేయాలి అని సూచించారు. జూన్ 1న జరిగిన సమీక్షలో వర్షాలపై తాను ముందస్తు సూచనలు ఇచ్చానని, జూన్ 9న భారీ వర్షం పడినప్పటికీ ఆ సమయంలో అధికారులు

...మిగతా 2లో

## టీఎంసీలో లొల్లి బీజేపీకి కలిసొస్తుందా?

**రాజ్యసభలో 2/3 మెజారిటీ దిశగా ఎన్‌డీఏ- మరి లోక్‌సభ మాటేమిటి?**

**ఎన్‌డీఏ రాజ్యసభలో 2/3 మెజారిటీ సాధిస్తుందా? ఎంత వరకు ఛాన్స్ ఉంది?**



**న్యూఢిల్లీ, జూన్ 14 (సింగిడి)**

బంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో మొదలైన తిరుగుబాటు, కేంద్రంలోని అధికార ఎన్‌డీఏ కూటమికి పార్లమెంట్‌లో కలిసిరానుంది. కీలకమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించుకోవడానికి అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధన దిశగా ఎన్‌డీఏ అడుగులు వేస్తోంది. తాజాగా జరిగిన రాజ్యసభ ఎన్నికలు, టీఎంసీ ఎంపీల రాజీనామాలతో ఎగువ సభలో ఎన్‌డీఏ బలం పెరిగి మూడింట రెండొంతుల మెజార్టీకి చేరువైంది. లోక్‌సభలో మాత్రం ఆ మ్యాజిక్ ఫిగర్‌కు ఎన్‌డీఏ కూటమి ఇంకా దూరంలోనే ఉంది. పార్లమెంటు ఉభయ సభల్లోనూ మూడింట రెండొంతుల మెజారిటీని సాధించేందుకు ప్రయత్నిస్తున్న

...మిగతా 2లో

18, 19, 20 తేదీల్లో

## రాష్ట్రంలో భారీవర్షాలు

**వాతావరణశాఖ**

ప్రస్తుతం రాష్ట్రంలో నెమ్మదిగా కదులుతున్న నైరుతి రుతుపవనాలు

2

## అమరావతి పనులు ఆగలేదు..

**జోరుగా సాగుతున్నాయి: మంత్రి నారా లోకేశ్**



2

పల్నాడు జిల్లాలో

## విషాద ఘటన

కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురి మృతి

బంధువుల ఇంటి వేడుకకు వెళ్లి తిరిగొస్తుండగా ఘటన

2

## మీనాక్షికి రేవంత్ వెన్నుపోటు

**రాజ్యసభ సీటు రాకుండా బీజేపీతో కుమ్మక్కు: కేటీఆర్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సొంత పార్టీ నేత, రాహుల్ గాంధీకి సన్నిహితురాలైన మీనాక్షి నటరాజన్‌కు రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచారని, ఆమెపై తప్పుడు కేసు బనాయించి వేధించారని విమర్శించారు. ఆమెకు మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సీటు రాకుండా అడ్డుకునేందుకు బీజేపీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు.

-హైదరాబాద్, జూన్ 14 (సింగిడి)

2



## మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

**బావిలో పడ్డ వ్యాను.. 8 మంది మృతి!**



**సోలాపూర్, జూన్ 14 (సింగిడి)**

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోలాపూర్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడింది. ఈ ప్రమాదంలో 8 మంది మరణించారని సమాచారం. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గురైన

..మిగతా 2లో

## దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేయండి

**సీఎం రేవంత్‌కు రఘునందన్ రావు సవాల్**



**హైదరాబాద్, జూన్ 14 (సింగిడి)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మెదక్ ఎంపీ, బీజేపీ నేత ఎం. రఘునందన్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర పాలనను సమర్థంగా నిర్వహించడంలో సీఎం విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. అలాగే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మెదక్‌లో మీడియాతో మాట్లాడిన రఘునందన్ రావు, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలకే

...మిగతా 2లో

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
15-06-2026



### వర్షాల నేపథ్యం... అధికారులపై
# సీఎం సీరియస్

**మొదటి పేజీ తరువాయి**

సరిగా పని చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షం సమయంలో క్యూర్ ఏరియాలో మునిసిపల్, పోలీస్, అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందన్నారు. వర్షం వచ్చినప్పుడు వాటర్ లాగింగ్ పాయింట్స్, బ్లాక్ స్పాట్స్, ట్రాఫిక్ జామ్ ఏర్పడే ప్రాంతాల డేటా ఆధారంగా పని చేయాలి అని సూచించారు. విద్యుత్ శాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలి అని స్పష్టం చేశారు.

ఫీల్డ్‌లో ఉండని అధికారులపై కఠిన చర్యలు : ఫీల్డ్‌లో ఉండని అధికారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని, వర్షం సమయంలో ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి కింద స్థాయి సిబ్బంది వరకు రోడ్ల పైన ఉండాల్సిందే అని అన్నారు. అవసరం అయితే తాను కూడా రోడ్ పైకి వస్తానన్నారు. వర్షం వల్ల ట్రాఫిక్ జామ్ అయితే కఠిన చర్యలు తప్పవన్నారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు వస్తే సహించేది లేదన్నారు. ట్రాఫిక్ డిపార్ట్మెంట్ లో తక్షణమే ఖాళీ లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రైతు వేదికలను యూరియా పంపిణీ కోసం ఉపయోగించు కోవాలి అని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రైతు వేదికలో యూరియా పంపిణీ బాధ్యతను స్థానిక అగ్రికల్చర్ అధికారికి అప్పగించాలన్నారు. యూరియా పంపిణీ లో రెవిన్యూ సిబ్బందిని భాగస్వామ్యం చేయాలని స్పష్టం చేశారు.

### 18, 19, 20 తేదీల్లో
# రాష్ట్రంలో భారీవర్షాలు
### వాతావరణశాఖ

**హైదరాబాద్, జూన్ 14 (సింగిడి)**

తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ చల్లని కబురందించింది. రాగల 3,4 రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు నెమ్మదిగా కదులుతున్నాయని, వచ్చే నాలుగైదు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం ఉందని వెల్లడించింది. ఈనెల 18, 19,20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో మరో 3 రోజులపాటు మార్పు ఉండదని పేర్కొంది. ఇవాళ, రేపు కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

విస్తరించి ఉన్న ద్రోణి : దక్షిణ కోస్తాంధ్రకు ఆనుకుని ఉన్న ద్రోణి పశ్చిమ మధ్య బంగాళాఖాతం నుంచి నైరుతి బంగాళాఖాతం మీదుగా దక్షిణ తమిళనాడు వరకు , సముద్రమట్టానికి 3.1 నుంచి 4.5 కిలోమీటర్ల ఎత్తు మధ్య విస్తరించి ఉందని వాతావరణశాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల ఉత్తర పరిమితి సోలాపూర్, హైదరాబాద్, భద్రాద్రి, కొత్తగూడెం, కళింగపట్నం, పారాదీప్, బరిపడ, పురూలియా, ధన్‌బాద్, ముజఫర్‌పూర్ మీదుగా కొనసాగుతున్నట్లుగా ఐఎండీ వెల్లడించింది

### దేశానికి వెలుగులు అందిస్తున్న
# సింగరేణి కార్మికులు

**మొదటి పేజీ తరువాయి**

డి.సి.పి. ఎ.భాస్కర్, సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్లు, సింగరేణి కార్మిక సంఘం ప్రతినిధి జనక్ ప్రసాద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సింగరేణి సంస్థను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. ఓపెన్ కాస్ట్ మైన్ సందర్శనలో భాగంగా రక్షణ పద్ధతులు, బొగ్గు నాణ్యత, ఉత్పత్తి ఉత్పాదకత, నిల్వ, రవాణా వంటి అంశాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. గ్రేడ్ 10, 11 బొగ్గు ఉత్పత్తి, బొగ్గు నిల్వ ప్రదేశాలు, రికార్డులు పరిశీలించడం జరిగిందని తెలిపారు. కార్మికులు శ్రమ, చెమట తో బొగ్గును ఉత్పత్తి చేసి సంస్థను అభివృద్ధి చేయడమే కాకుండా దేశానికి వెలుగులు అందిస్తున్నారని, వారి ఆత్మ గౌరవం కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. వీటిని అపహాస్యం చేస్తూ కొంత మంది అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సింగరేణి సంస్థ అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అని, ఇందులో ప్రతి అంశం పారదర్శకంగా జరుగుతుందని, సింగరేణి సంస్థ తెలంగాణ ఆస్తి అని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి అందరూ కలిసి రావాలని తెలిపారు. కార్మికుల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం అధునాతన వైద్య పరికరాలు, నూతన వైద్య విధానాల ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగా అభివృద్ధిలో భాగంగా జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక సౌకర్యాలతో నవీకరించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, కార్మికుల సమస్యలు పరిష్కరించి వారి పిల్లల విద్యకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సింగరేణి కార్మికులకు 1 కోటి 25 లక్షల రూపాయల ప్రమాద భీమా కల్పించడం జరిగిందని, సింగరేణి కార్మికుల పిల్లలకు యు.పి.ఎస్.సి. పరీక్షలు, ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం, సింగరేణి సంస్థ సమన్వయంతో సింగరేణి బొగ్గు గనులను మరింత అభివృద్ధి చేసి కార్మికుల సంక్షేమం దిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ఆత్రం సక్కు, సంబంధిత శాఖల అధికారులు, సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేయండి

**మొదటి పేజీ తరువాయి**

పరిమితమైందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. రాష్ట్ర శాసనసభను రద్దు చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలని సూచించారు. అసెంబ్లీ రద్దు చేస్తే తెలంగాణలో గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఎంపీలు రాజీనామా చేయాల్సిన అవసరం లేదని, కేవలం అసెంబ్లీని రద్దు చేసి ప్రజల తీర్పు కోరాలని డిమాండ్ చేశారు. ప్రజల మద్దతు తమకే ఉందని బీజేపీ నమ్మకంగా ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా రఘునందన్ రావు ప్రస్తావించారు. కల్లాల్లో ధాన్యం నిల్వ ఉండిపోవడం, బ్యాంకుల్లో నగదు కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి నుంచి తగిన స్పందన కనిపించడం లేదని విమర్శించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్లే రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థ నడుస్తోందని వ్యాఖ్యానించారు. మాటలకే పరిమితం కాకుండా తన సవాల్‌ను స్వీకరించాలని సీఎం రేవంత్ రెడ్డిని రఘునందన్ రావు కోరారు.

# ఇన్నోవేషన్ భారత డీఎన్ఏలోనే ఉంది

**న్యూఢిల్లీ, జూన్ 14 (సింగిడి)**

భారత్ కేవలం తన సుస్థిర భవిష్యత్తు కోసమే కాకుండా ప్రపంచం కోసం సరికొత్త ఆవిష్కరణలు చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇతరులు కనుగొన్న పరిష్కారాలను వాడుకునే దేశంగా మాత్రమే భారత్ మిగిలిపోలేదని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందించే స్థాయికి ఎదిగిందని స్పష్టం చేశారు. ఫ్రాన్స్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక 'భారత్ ఇన్నోవేట్స్' సదస్సులో ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో కలిసి మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఉన్న బంధాన్ని, సాంకేతిక రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రధాని మోదీ కొనియాడారు. భారత్‌కు చెందిన యువ ఆవిష్కర్తలు కేవలం స్థానిక సమస్యలకే కాకుండా, సమస్త మానవాళికి ప్రయోజనం చేకూర్చే సరికొత్త సాంకేతిక పరిష్కారాలను కనుగొంటున్నారని మోదీ ప్రశంసించారు. అలాగే, భారత్, ఫ్రాన్స్ మధ్య సంబంధాల గురించి మోదీ ప్రస్తావించారు. ఇరుదేశాల మధ్య ఉన్నది సాధారణ బంధం కాదని, అదొక ప్రత్యేక భాగస్వామ్యమని పేర్కొన్నారు. ఈ బంధానికి అనుసంధానం, దృఢ సంకల్పం, ఆవిష్కరణ, స్ఫూర్తి, ఉమ్మడి దృక్పథం ఐదు ముఖ్యమైన స్తంభాలని వివరించారు.



**ఆవిష్కరణలకు నిలయంగా భారత్**

భారత్ ఆవిష్కరణలకు నిలయమని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అభివర్ణించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), వాతావరణ మార్పుల వంటి కీలక రంగాల్లో రెండు దేశాల మధ్య భాగస్వామ్యం ఉందని ఆయన పేర్కొన్నారు. తాము మేక్-ఇన్-ఇండియా కార్యక్రమాన్ని గౌరవిస్తున్నామని, వివిధ రంగాల్లో ఫ్రాన్స్ ఇందులో భాగస్వామిగా ఉందని మెక్రాన్ తెలిపారు. పౌర అణు శక్తి రంగంలో, ముఖ్యంగా 'స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల' విషయంలో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఇక, 'భారత్ ఇన్నోవేట్స్ 2026' అనేది భారత ప్రభుత్వం చేపట్టిన ఒక కీలక కార్యక్రమం. ప్రపంచ వేదికపై దేశంలోని డీప్-టెక్ స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థల వృద్ధిని వేగవంతం చేయడం దీని లక్ష్యం. ఈ కార్యక్రమం భారత్, ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలకు చెందిన ప్రముఖ ఆవిష్కరణల స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు పాల్గొన్నాయి. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో ఉన్న మోదీ, అక్కడ మెక్రాన్‌తో చర్చలు జరపడంతో పాటు G-7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు.

**మోదీని ఆలింగనం చేసుకున్న మెక్రాన్**

ఇదిలా ఉండగా, ప్రధాని మోదీకి ఆదివారం ఫ్రాన్స్‌లోని నైస్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఘన స్వాగతం పలికారు. ఇద్దరు నేతలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, కరచాలనం చేసుకున్నారు. అనంతరం, 'భారత్ ఇన్నోవేట్స్'ను ఇద్దరూ సంయుక్తంగా ప్రారంభించారు. జూన్ 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ ఆవిష్కరణల సదస్సు, భారతీయ ఆవిష్కర్తలను ప్రపంచ పెట్టుబడిదారులు, పారిశ్రామిక నాయకులు విద్యాసంస్థలతో అనుసంధానించడానికి ఒక శక్తివంతమైన వేదికగా ఉపయోగపడుతుంది. ఇక, ఈ ఇన్నోవేషన్ కార్యక్రమంతో భారత్-ఫ్రాన్స్ సంబంధాలు బలపడనున్నాయి. రక్షణ, అంతరిక్షం, డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి వివిధ రంగాల్లో ఇరుదేశాల మధ్య సహకారం మరింత బలపడనుంది.

# టీఎంసీలో లొల్లి బీజేపీకి కలిసొస్తుందా?

**మొదటి పేజీ తరువాయి**

ఎన్‌డీఏకు, టీఎంసీలో తలెత్తిన అంతర్గత తిరుగుబాటు బలాన్ని చేకూర్చే అవకాశం ఉంది. రాజ్యసభలో ప్రస్తుతం ఎన్‌డీఏ బలం 148 కాగా, ఝార్ఖండ్, మిజోరాంలో స్వతంత్ర స్థానాల ఎన్నికల ద్వారా మరో మూడు సీట్లు కూటమి ఖాతాలో పడనున్నాయి. దీనికి తోడు, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు రాజ్యసభ ఎంపీలు రాజీనామా చేయడంతో, బంగాల్ ఉపఎన్నికల తర్వాత ఆ మూడు స్థానాలను కూడా ఎన్‌డీఏ గెలుచుకోనుంది. దీంతో ఎగువ సభలో ఎన్‌డీఏ బలం 154కి చేరనుంది. రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించాలంటే 163 స్థానాలు ఉండాలి. దీనికి ఎన్‌డీఏ కూటమి కేవలం 9 స్థానాల దూరంలో ఉంటుంది. రానున్న రోజుల్లో మరికొందరు టీఎంసీ ఎంపీలు (సుమారు 20 మంది) రాజీనామా చేసే అవకాశం ఉంది. ఈ కారణంగా ఎన్‌డీఏ సులభంగానే 163 మార్కును దాటి, కీలక బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలాన్ని సాధించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ ఏడాది నవంబర్‌లో ఉత్తరప్రదేశ్ నుంచి 10 మంది రాజ్యసభ ఎంపీలు పదవీ విరమణ చేయనున్నారు. గత యూపీ అసెంబ్లీలో సమాజ్‌వాదీ పార్టీకి బలం పెరగడం వల్ల అక్కడ కొన్ని స్థానాలను ఎన్‌



డీఏ కోల్పోయే ప్రమాదం ఉంది. మరోవైపు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి బలం క్రమంగా క్షీణిస్తోంది. డీఎంకేకు చెందిన 8 మంది, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ముగ్గురు రాజ్యసభ ఎంపీలు కూటమికి దూరం కావడంతో ప్రస్తుతం 'ఇండియా' కూటమి బలం రాజ్యసభలో 64కి పడిపోయింది. వైఎస్సార్ కాంగ్రెస్‌కు 7 సీట్లు ఉండగా, బిజూ జనతా దళ్‌కు 6 సీట్లు ఉన్నాయి. ఎండీఎంకే వంటి స్వతంత్ర పార్టీలు బిల్లుల ఆధారంగా ఎటువైపు అయినా మొగ్గు చూపే అవకాశం ఉంది.

**లోక్‌సభలో మెజారిటీ కష్టమే!**

లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించాలంటే 363 మంది ఎంపీల మద్దతు అవసరం ఉంటుంది. తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయిన దాదాపు 20 మంది ఎంపీలు ప్రత్యేక వర్గంగా ఏర్పడి ఎన్‌డీఏకు మద్దతు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. వీరంతా సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి, తాము టీఎంసీ నుంచి విడిపోతున్నట్లు అధికారిక లేఖను అందజేయనున్నారు. ఈ తిరుగుబాటు ఎంపీల మద్దతుతో లోక్‌సభలో ఎన్‌డీఏ బలం 313కి చేరనుంది. అయినప్పటికీ, లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి అవసరమైన 363 మార్కును చేరుకోవడానికి ఎన్‌డీఏ దూరంలో ఉంటుంది.

**ఆ బిల్లులు పాసవ్వాలంటే?**

వచ్చే వర్షాకాల సమావేశాల్లో అత్యంత కీలకమైన బిల్లులను తీసుకురావడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కానీ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించడానికి ప్రత్యేక మెజారిటీ అవసరం. దీని ప్రకారం, సభలో మొత్తం సభ్యుల్లో కనీసం సగం మంది హాజరు కావాలి. హాజరై ఓటు వేసిన వారిలో మూడింట రెండు వంతుల మెజారిటీ లభిస్తేనే సదరు బిల్లు ఆమోదం పొందుతుంది. ఏప్రిల్‌లో జరిగిన ఓటింగ్ సమయంలో 528 మంది ఎంపీలు హాజరయ్యారు. దీనివల్ల 2/3 మెజారిటీకి అవసరమైన సంఖ్య 352గా నిర్ణయించడమైంది. అయితే ఈ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు రావడంతో, 54 ఓట్ల తేడాతో బిల్లు వీగిపోయింది. ఒకవేళ బీజేపీ కనుక 2/3 మెజారిటీ సాధించగలిగితే చాలా సులువుగా తను అనుకున్న బిల్లును ఆమోదించగలుగుతుంది. మరి ఏం కానుందో చూడాలి.

# మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి**

భక్తులు పంధర్‌పుర్ తాలూకాలోని రంజని గ్రామానికి చెందినవారిగా సమాచారం. వీరంతా మస్వాద్‌లోని ఆలయాన్ని సందర్శించి తిరిగి వస్తుండగా తండుల్‌వాడి సమీపంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.

ప్రాథమిక సమాచారం ప్రకారం, డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది. ప్రమాద సమయంలో వాహనంలో 15 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

**దుర్ఘటనపై స్పందించిన మహారాష్ట్ర సీఎం**

మరోవైపు, ఈ దుర్ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాన్ని అత్యంత విషాదకరంగా అభివర్ణించారు. మరణించిన వారికి తన హృదయపూర్వక నివాళులు అర్పించారు. ఈ కష్ట సమయంలో మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, అలాగే, ఒక్కొక్కరికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు.

కాగా, ఈ ప్రమాదం నుంచి ఏడుగురిని రక్షించామని, వారు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని ఫడణవీస్ తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న



వెంటనే సోలాపూర్ జిల్లా కలెక్టర్, ఎస్పీ వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారని చెప్పారు. పరిస్థితిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక యంత్రాంగంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని ఆయన పేర్కొన్నారు.

**బావి చుట్టూ ఎలాంటి రక్షక గోడలేదు!**

ఇదిలా ఉండగా, మస్వాద్ నుంచి పంధర్‌పుర్ వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఒక బావి ఉందని, ఆ బావికి చుట్టూ ఎలాంటి రక్షణ గోడ లేదని స్థానికులు చెబుతున్నారు. కాగా, మృతుల పేర్లను అధికారులు వెల్లడించారు. ఇందుబాయి దశరథ్ భావు(60), పూజా అమోల్ సటోర్(23), సమర్థ బాలాజీ బావ్చే(27), అశ్విని సందీప్ బావ్చే(27), సంస్కర్ సందీప్ బావాచే(14), సంస్కృతి సందీప్ బావ్చే(14), పూజా బాలాజీ బావచే(ఆరు నెలలు), ఆరవ్ అశోక్ సతోరే(ఎనిమిదేళ్లు)గా అధికారులు గుర్తించారు.

**ఈ ప్రమాదం అత్యంత బాధాకరమైనది: ఎమ్మెల్యే రోహిత్**

మరోవైపు, ఈ ఘటనపై ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ప్రమాదం అత్యంత బాధాకరమైనదని, హృదయ విదారకమైనదని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కష్ట సమయంలో మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ప్రమాదానికి గల కారణాలను కనుగొనడంతో పాటు, సహాయక చర్యల్లో ప్రభుత్వం తక్షణమే సహాయపడాలని ఆయన పేర్కొన్నారు.

**రైలు ఢీకొన్న ఘటనలో మరో నలుగురు మృతి**

మధ్యప్రదేశ్‌లోని మొరెనాలో ఖజురహో- ఉదయ్‌పుర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగాయన్న వదంతులు నలుగురి ప్రాణాలను బలిగొన్నాయి. రైలులో మంటలు చెలరేగాయన్న వదంతులతో భయపడిన కొందరు ప్రయాణికులు ఎమర్జెన్సీ చైన్ లాగారు. కిందికి దిగి, పక్క ట్రాక్ పై ఉండగా వేగంగా దూసుకొచ్చిన మరో రైలు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

# అమరావతి పనులు ఆగలేదు

**అమరావతి, జూన్ 14 (సింగిడి)**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు శరవేగంగా, ఎక్కడా విరామం లేకుండా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. రాజధాని పనులు ఆగిపోయాయని, చిన్న వర్షానికే మునిగిపోతోందని కొందరు చేస్తున్న విష ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు నిర్మాణ పనుల పురోగతిని చూపిస్తూ ఆయన తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు. "అమరావతిలో పనులు ఏమాత్రం ఆగడం లేదు. వర్షం కురిస్తే మునిగిపోయిందంటూ కొందరు ప్రచారం చేస్తున్నారు. కానీ, నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. రాజధానిలో ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు, ప్రధాన రహదారులు, రిజర్వాయర్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్మిస్తున్న టవర్లు, మంత్రుల బంగ్లాల నిర్మాణాలు కూడా చురుగ్గా సాగుతున్నాయి. ఇకనైనా విష ప్రచారాన్ని ఆపండి" అని చెప్పిన ఓ వీడియోను మంత్రి లోకేశ్ 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను వీడియో రూపంలో ప్రజల ముందు ఉంచి, అమరావతిపై జరుగుతున్న దుష్ప్రచారానికి మంత్రి లోకేశ్ గట్టిగా బదులిచ్చారు.





# మీనాక్షికి రేవంత్ వెన్నుపోటు

ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి అవినీతి, భూ ఒప్పందాలపై మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని, దీనికి ప్రతీకారంగానే హైదరాబాద్‌లో ఆమెపై తప్పుడు కేసు పెట్టించారని అన్నారు. సొంత పార్టీ నేతలనే వెన్నుపోటు పొడిచే నైజం రేవంత్ రెడ్డిదని ఆయన దుయ్యబట్టారు. హిట్లర్ తన ఆదర్శం అని సీఎం చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనను 'అట్టర్ ఫ్లాప్ సినిమా'గా అభివర్ణించిన కేటీఆర్, ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, కనీసం 4,000 ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ప్రశ్నించారు. రూ.4,000 నిరుద్యోగ భృతి హామీని కూడా విస్మరించారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను లక్షాధికారులను చేశామని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. ప్రజాతీర్పును ధిక్కరించి దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించడమే దీనికి కారణమని స్పష్టం చేశారు. జూన్ 25 నుంచి జరిగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని, డిజిటల్ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.



# పల్నాడు జిల్లాలో విషాద ఘటన

**పల్నాడు , జూన్ 14 (సింగిడి)**

ఏపీలోని పల్నాడు జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అచ్చంపేట మండలం, కోనూరు గ్రామం వద్ద కృష్ణా నదిలో ఓ పడవ బోల్తా పడిన ఘటనలో నలుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. వివరాల్లోకి వెళితే, కోనూరు గ్రామంలోని కుంకలగుంట గంగయ్య అనే వ్యక్తి ఇంటికి బంధువులు వేడుక కోసం వచ్చారు. అనంతరం, సరదాగా గడిపేందుకు 10 మంది కలిసి ఒక చిన్న పడవలో నదిలో షికారుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పడవ అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో పడవలో ఉన్నవారంతా నీటిలో మునిగిపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. వారు ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు. మిగిలిన నలుగురు గల్లంతు కాగా, సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గాలింపు చర్యల్లో నలుగురి మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగం ఓ నిజం
Singidi
సోమవారం
15-6-2026

# కరీంనగర్‌లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం

**ఓటరు జాబితా సవరణలో శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి**
**మేడిపల్లి సత్యం, నమిండ్ల శ్రీనివాస్**



**కరీంనగర్, (సింగిడి)**
ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బూత్ స్థాయి ప్రతినిధుల శిక్షణ కార్యక్రమం ఆదివారం సీతారాంపూర్‌లోని పీఎం కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పీసీసీ ఉపాధ్యక్షుడు, ప్రధాన శిక్షకుడు నమిండ్ల శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లౌకికవాద, కాంగ్రెస్ అనుకూల ఓటర్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త చురుకుగా పాల్గొని అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగుతున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో కరీంనగర్ అసెంబ్లీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నమిండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బూత్ స్థాయి నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో పాల్గొని ప్రతి ఓటును రక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను సంబంధం లేని కేసు ఆధారంగా తిరస్కరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఓట్లతో పాటు సీట్లను కూడా దోచుకునే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఇతర నాయకులు మాట్లాడుతూ ఓటరునమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సహకారం అందించడంతో పాటు ఓటర్ మ్యాపింగ్‌పై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం నమిండ్ల శ్రీనివాస్ బూత్ స్థాయి ప్రతినిధులకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సమగ్ర శిక్షణ అందించారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి

**సూచనమార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న**



**కరీంనగర్,(సింగిడి):**
కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి అధికారి-2లు, బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై సీతారాంపూర్‌లోని పీఎం కన్వెన్షన్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగి పోకుండా ప్రతి బూత్ స్థాయి అధికారి, బూత్ ఏజెంట్ అప్రమ త్తంగా పనిచేయాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయడంలో బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి డివిజ న్‌లో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఓట్లు సక్రమంగా నమోదై ఉన్నాయో లేదో నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. ఇంటింటి వివరాలు, ఓటర్ల సమా చారం గురించి పూర్తి అవగాహనతో పనిచేస్తూ, ఏవైనా అక్రమాలు లేదా పొరపాట్లు గుర్తిస్తే వెంటనే పార్టీ నాయకుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా ప్రతి బూత్ ఏజెంట్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆకుల నరసన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన కల్నల్ సంతోష్ బాబు స్మారక చదరంగం ఎంపిక పోటీలు

**విజేతలకు బహుమతులు అందజేసిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు**



**కరీంనగర్, (సింగిడి)**
చదరంగం కేవలం ఆట మాత్రమే కాకుండా మేధస్సుకు పదును పెట్టి, ఏకాగ్రతతో పాటు వ్యూహాత్మక ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించే అద్భుత క్రీడ అని కరీంనగర్ నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. నగరంలోని భగత్‌నగర్ చైతన్య యూత్ క్లబ్ వేదికగా వీరమరణం పొందిన కల్నల్ సంతోష్ బాబు స్మారక కమిటీ ఆధ్వర్యంలో, విశ్వనాథ్ చెస్ అకాడమీ నిర్వహించిన అఖిల భారత ఫిడే రేటెడ్ వేగవంతమైన చదరంగం పోటీల ఎంపికలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ మేయర్, పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదరంగం క్రీడ క్రీడాకారుల్లో చతురత, వ్యూహాత్మక ఆలోచన, నిర్ణయ సామర్థ్యాలను పెంపొందిస్తుందన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. కరీంనగర్‌కు చెందిన యువ క్రీడాకారులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గ్రాండ్‌మాస్టర్లుగా ఎదిగి నగరానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. దేశ రక్షణలో వీరోచితంగా పోరాడి అమరుడైన కల్నల్ సంతోష్ బాబు జ్ఞాపకార్థం ఇటువంటి జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్న విశ్వనాథ్ చెస్ అకాడమీ నిర్వాహకులను అభినందించిన ఆయన, క్రీడాకారులకు తమ సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ చెస్ అకాడమీ నిర్వాహకులు, చైతన్య యూత్ క్లబ్ ప్రతినిధులు, క్రీడాకారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ సంతకం ఫోర్జరీ కేసు

**మెట్‌పల్లి, (సింగిడి):**
మెట్‌పల్లి తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి, ప్రభుత్వ అధికారిక ముద్రలను నకిలీగా తయారు చేసి భూ రిజిస్ట్రేషన్ మోసానికి పాల్పడిన ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పట్టణంలోని 5వ వార్డు ఆరపేట శివారులో సర్వే నెం.191/ఈలో ఉన్న 8గుంటల భూమికి సంబంధించి తహసీల్దార్ కార్యాలయం జారీ చేయని ఆబాది సర్టిఫికేట్‌ను గత నెలలో నకిలీగా తయారు చేశారు. ఈ నకిలీ పత్రాల ఆధారంగా తప్పుడు రిజిస్ట్రేషన్ జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుపై జగిత్యాల జిల్లా ఎస్పీ అశోకకుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, మెట్‌పల్లి డీఎస్పీ రాములు పర్యవేక్షణలో, సీఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి విచారణ చేపట్టింది. విచారణలో మొత్తం ఆరుగురు నిందితుల పాత్ర వెలుగు లోకి రాగా, వారిలో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైనవారు మెట్‌పల్లి పట్టణానికి చెందిన రాజుల దేవి నర్సయ్య, కలికోట వేణు, లోలపు గణేష్, పాకాల రాకేష్‌గా గుర్తించారు. నకిలీ పత్రాల తయారీకి ఉపయోగించిన కంప్యూటర్ పరికరాలు, రబ్బరు స్టాంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నింది తులను మెట్‌పల్లి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి.

# జనం మెచ్చిన నాయకుడు ప్రణవ్



**అవినీతి రహిత పాలన అందించడమే ఆయన లక్ష్యం**
**యువ నేత వైపు మొగ్గు చూపుతున్న నియోజకవర్గ ప్రజలు**
**ప్రచారానికి దూరంగా ప్రజలకు దగ్గరగా యువనేత**

**జమ్మికుంట, (సింగిడి):** అధికార పార్టీలో ఉన్నప్పటికీ అవినీతిరహిత నేతగా నియోజకవర్గ ఇన్చార్జిగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతిక్షణం ప్రజల కోసం పనిచేస్తున్న యువ నేతగా ప్రజల మెప్పు పొందుతున్న నాయకుడు ప్రణవ్. ప్రచారానికి దూరంగా ప్రజా సమస్యలకు దగ్గరగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ అన్నా అంటే నేను ఉన్నాను అంటూ నియోజకవర్గస్థాయిలో ఆయన శక్తికి మించి చేస్తున్న సేవలను చూసి ప్రజలు ఆయనపై అభిమానాన్ని పెంచుకుంటున్నారు. అసెంబ్లీఎన్నికల్లో ఓటమి పాలు చెందినప్పటికీ నియోజక వర్గంలోనే ఉంటూ కేవలం నియోజకవర్గం ఇన్చార్జి అనే పదవితో అహర్నిశలుపార్టీ అభివృద్ధి కోసం పని చేస్తూ అటు పార్టీని ఇటు కార్యకర్తలను కాపాడుకుంటున్న నాయకుడిగా ప్రణవ్ మంచి పేరు తెచ్చుకుంటున్నారు.

**అవినీతిరహిత నేతగా గుర్తింపు**
అధికారపార్టీలో ఉన్న ప్పటికీ అవినీతి చేయకుండా నిజాయితీగా తనను నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటూ అధికారులను సైతం ఆప్యాయంగా పలకరిస్తూ అవినీతిరహిత నేతగా పేరు తెచ్చుకోవడం ప్రణవ్‌కే సాధ్యం. అధికార పార్టీలో ఉన్నాము కదా అడ్డగోలు సంపాదించవచ్చు అన్న ఆలోచన లేకుండా నిజాయితీగా సేవలు అందిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయకుల్లో ఎలాంటి అవినీతి ముద్ర లేని నాయకుడిగా కాంగ్రెస్ పార్టీ నుండి ప్రణవ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఏవిధంగా చూసినా ఇలాంటి నాయకుడు దొరకడం హుజురాబాద్ నియోజకవర్గం ప్రజల అదృష్టం అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

**కనిపించని ఫైర్ బ్రాండ్ ప్రణవ్**
సముద్రం లాంటి కాంగ్రెస్ పార్టీలో అతి తక్కువ సమయంలో నియోజక వర్గంలోని నాయకులను కార్యకర్తలను సమన్వయం చేస్తూ సుమారు మూడు సంవత్సరాలుగా పార్టీని నడిపిస్తూ వస్తున్నాడు. కానీ తప్పు



చేసిన నాయకులపై చర్యలు తీసుకోవ డంలో ప్రణవ్ కాస్త ఆలోచిస్తూ వారికి అవకాశాలు ఇస్తూ పద్ధతులు మార్చు కోవాలని సూచిస్తున్న ఆయన మంచి తనాన్ని కొంతమంది నాయకులు అలుసుగా చేసుకొని వారి పద్ధతులు మార్చుకోవడంలేదు. కానీ కనిపించని ఫైర్ బ్రాండ్ ప్రణవ్‌బాబు అని మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో చాలామందికి తెలిసి వచ్చింది. దెబ్బ తీయాలంటే చర్యలు తీసుకోవడం కాదు చెప్పినట్టు వినకుంటే సమయం చూసి దెబ్బ కొట్టొచ్చని నమ్మిన వ్యక్తి యువ నాయకుడు. గత మున్సిపల్ ఎన్నికలకు ముందు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించిన నాయకులకు రిజర్వేషన్ మార్పుతో వారి రాజకీయ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సైలెంట్ గానే ఉంటూ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే వారిపై తనదైన శైలిలో వారికి సమాధానం చెబుతూ పార్టీని ప్రజలను కాపాడే విషయంలో నిజా యితీగా పనిచేస్తున్న నాయకుడి పట్ల ప్రజలు విశ్వాసాన్ని వ్యక్తం చేస్తు న్నారు.

**కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో కనిపించని వ్యతిరేకత**

కాంగ్రెస్ ప్రభుత్వం పై పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత లేదని ముఖ్యంగా హుజరా బాద్ నియోజకవర్గంలో ప్రభుత్వంపై పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత లేదని కేవలం కొంతమంది నాయకులు మాత్రమే పార్టీకి వ్యతిరే కంగా పనిచేస్తూ పార్టీని బద నం చేసే ప్రయత్నం చేస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు దాన్ని అమలు చేస్తున్న నియో జకవర్గం ఇన్చార్జి ప్రణవ్ బాబుపై నియో జక వర్గంలో ఎటువంటి వ్యతిరేకత లేదు. పదవులు రాలేదని అవినీతిని సహిం చడం లేదని కొంతమంది నేతలు కావాలని పార్టీని ప్రణవ్ బాబును కొంతమంది నేతలు బదనం చేయడానికి ప్రయత్నం చేస్తున్నప్పటికీ ప్రజలు వాటిని నమ్మే పరిస్థితి లేదు. రాబోయే రోజుల్లో హుజురాబాద్ నియోజకవర్గం లో ప్రణవ్ నాయకత్వంలో కాంగ్రెస్ జెండా ఎగర డం ఖాయమని స్పష్టంగా తెలుస్తుంది.

# ఉపాధ్యాయుడు చిటికెన వేణుకు పద్మరత్న అవార్డు

**అభినందించిన "పోపా" నాయకులు..**




**జమ్మికుంట, (సింగిడి):**
పద్మశాలి ప్రొఫెషనల్ అండ్ అఫీషియల్స్ అసోసియేషన్ (పోప) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పద్మ శాలి విద్యార్థుల ప్రతిభ అవార్డులు ఉపా ధ్యాయుల పద్మ రత్న అవార్డుల ప్రధానోత్సవం జిల్లా పద్మశాలి అఫీషి యల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియే షన్ అధ్యక్షులు పోలు సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా పద్మశాలి సీనియర్ నాయకులు మెతుకు సత్యం,పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు మామిడాల సురేందర్ ఆధ్వర్యంలో పద్మ రత్న అవార్డులను ప్రధానం చేయ డం జరిగినది. ఈ సందర్భంలో చిటికెన వేణు ఇల్లంతకుంట పద్మశాలి ప్రొఫె షనల్ అఫీషియల్స్ అసోసియే షన్ ఇల్లందకుంట అధ్యక్షుడు స్కూల్ అసిస్టెంట్ ఇం గ్లీష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇల్లందకుంటలో పనిచేస్తున్న చిటికెన వేణుకు పద్మ రత్న అవార్డును ఉద్యోగంలో చేసిన సేవలకు గాను మరియు పద్మశాలి అఫీషియల్ సెండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జమ్మికుంట ఇల్లంత కుంట మండలాలలో అంకితభా వంతో చేసినటువంటి సేవలకుగాను వీరికి పద్మ రత్న అవార్డు, మేమెంటో, సర్టిఫికెట్, శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది ఇట్టి కార్యక్ర మంలో జమ్మికుంట మండల పోప అధ్యక్షుడు బండి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, వీణవంక మండల పోప అధ్యక్షులు యు. రాజయ్య, దూరం రాజ మల్లయ్య, జిల్లా నాయకులు రామకృష్ణ, కేదారే శ్వర్, జమ్మికుంట మాజీ మండల విద్యాధికారి తాటిపాముల భావన ఋషి, శ్రీరాంపూర్ మండల విద్యా ధికారి సిరిమల్లె మహేష్, హుజురా బాద్ మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్, ఇల్లందకుంట మండల ప్రధాన కార్యదర్శి సత్యనా రాయణ, తదితరులు పాల్గొని అభినం దించారు.

# ఇందారం ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ఉచిత వైద్య శిబిరంలో 410 మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ**



**కరీంనగర్, (సింగిడి):** జైపూర్ మండలం ఇందారం గ్రామంలో సర్పంచ్ మహమ్మద్ ఫ యాజుద్దీన్, ఉపసర్పంచ్ ఎలకటూ రి శివ ఆధ్వ ర్యంలో కరీంనగర్ రెనే ఆసు పత్రి, గోదావరిఖని సింగరేణి రెనే గుండె వైద్య కేంద్రం సం యుక్తంగా నిర్వహిం చిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామపం చాయతీ కార్యాల య ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరంలో రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత విద్యుత్ పరీక్షలు నిర్వహించి, హాజ రైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ తులసిరామ్, డాక్టర్ ధర్మతేజ, అత్యవసర వైద్య నిపుణుడు డాక్టర్ సంతానం, డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ తేజస్విని సేవలందించి సుమారు 410 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గోదా వరిఖని సింగరేణి రెనే గుండె వైద్య కేంద్రం అధిపతి రామకృష్ణ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో పూర్తికాల గుండె వైద్య నిపుణుడు అందుబాటులో ఉన్న ఏకైక ఆసుపత్రి సింగరేణి గుండె వైద్య కేంద్రం అని తెలిపారు. గ్రా మీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు చేరువ చేయడం, గుండె వ్యాధులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా భవిష్యత్తులో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొ న్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి శిబిరం నిర్వహ ణకు సహకరించిన సర్పంచ్ మహ మ్మద్ ఫయాజుద్దీన్, ఉపసర్పంచ్ ఎలకటూరి శివలకు ఆయన కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెనే ఆసుపత్రి ప్రతినిధులు అర విండ్, అభిలాష్ రెడ్డి, అవినాష్, గౌతం, తదితరులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# స్నేహానికి నిలువెత్తు నిదర్శనం..

**మిత్రుడి కుటుంబానికి రూ. లక్ష చేయూత**



**జమ్మికుంట, (సింగిడి):**
బాల్యమిత్రుడి మరణంతో విషాదంలో మునిగి పోయిన స్నేహితులు తమ ఆత్మీయతను చాటు తూ మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. ఇటీవల గుండెపోటు, వడదెబ్బ కారణంగా మృతి చెందిన గుండా సురేందర్ కుటుంబానికి జమ్మి కుంట జెడ్పీ ఉన్నత పాఠశాల 1983-84 పదో తరగతి బ్యాచ్ మిత్రులు కలిసి రూ.1 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గుండా సురేందర్‌తో కలిసి విద్యాభ్యాసం చేసిన బాల్యమిత్రులు తమ స్నేహబంధానికి గుర్తుగా ఈ మొత్తాన్ని ఆయన కుమార్తె పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా ఏర్పాటు చేశారు. మిత్రుడి కుటుంబ భవిష్యత్తుకు తమవంతు చేయూత అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ, కష్టసుఖాల్లో పరస్పరం అండగా నిలబడటమే నిజమైన స్నేహమని పేర్కొన్నారు. "మనమంతా స్నేహమేరా జీవితం" అనే నానుడికి అనుగుణంగా ఐక్యతతో ముం దుకు సాగుతూ, మృతుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాల్యమిత్రుల సేవాసమితి సభ్యులు మంద వెంకట్ రెడ్డి, కనుమల్ల గణపతి, ఆర్. సంపత్ కుమార్, పెంచలయ్య, కొక్కుల రాజేందర్, డి. రాజేందర్, సాంబయ్య, సమ్మయ్య, గుడిమల్ల బలరాం, ఎ. సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్గటూర్‌కు కూతవేటు దూరంలో
# 'కొత్తబాబా' హల్ చల్..!

**వెల్గటూర్ (సింగిడి):** వెల్గటూర్ మండల కేంద్రానికి సమీపంలోని ఓ గ్రామంలో ఇటీవల కాలంలో ఓ వ్యక్తి "ఆధ్యాత్మిక గురువు"గా ప్రచారంలోకి వచ్చి స్థానికంగా చర్చనీయాంశంగా మారినట్లు సమాచారం. పెళ్లిళ్లు ఆలస్యమవుతున్న వారికి, సంతానం లేని దంపతులకు, వ్యాపారాల్లో నష్టాలు ఎదుర్కొంటున్న వారికి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రత్యేక పూజలు, యజ్ఞాలు నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపిస్తానని చెబుతున్నట్లు గ్రామాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. స్థానికుల కథనం ప్రకారం, ఆయన్ని ఆశ్రయించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, ముఖ్యంగా పెళ్లిళ్లు కావాలని ఆశపడుతున్న యువకులు, సంతానం కోసం ఎదురుచూస్తున్న దంపతులు, ఆర్థిక ఇబ్బందులతో ఉన్న కొందరు వ్యాపారులు ఆయన వద్దకు వెళ్తున్నట్లు చెబుతున్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు, యజ్ఞాల పేరుతో వేల రూపాయల నుంచి మరింత మొత్తాలు ఖర్చు చేయాల్సి వస్తోందని కొందరు పేర్కొంటున్నారు.

**మాజీ ప్రజాప్రతినిధులు సైతం..?**
ఈ వ్యవహారంలో ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే, కొందరు మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సైతం ఆ బాబాను కలుస్తున్నారనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది. వారి సందర్శనలతో ఆ బాబాకు మరింత ప్రాచుర్యం లభిస్తోందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

**యువతలో పెరుగుతున్న ఆసక్తి**
ప్రత్యేకంగా పెళ్లిళ్లు ఆలస్యమవుతున్న యువతలో ఈ బాబాపై విశ్వాసం పెరుగుతోందని చెబుతున్నారు. కొందరు యువకులు పూజల కోసం వేల రూపాయలు ఖర్చు చేసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ పూజల వల్ల నిజంగా ఫలితాలు వచ్చాయా లేదా అన్న విషయంపై స్పష్టమైన ఆధారాలు మాత్రం లేవు.



**విలేకర్ల సందర్శనలపైనా చర్చ**
స్థానికంగా కొందరు విలేకర్లు కూడా ఆ బాబాను కలిసినట్లు ప్రచారం జరుగుతుండటం మరో చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో ప్రజల్లో ఆసక్తితో పాటు అనేక సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**మూఢనమ్మకాలా..? ఆధ్యాత్మిక విశ్వాసమా..?**
సదరు బాబా నిర్వహిస్తున్న పూజలు, యజ్ఞాలు ఆధ్యాత్మిక విశ్వాసంలో భాగమా, లేక ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని జరుగుతున్న వ్యవహారమా అన్న చర్చ వెల్గటూర్ పరిసర ప్రాంతాల్లో సాగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదని తెలుస్తోంది. ప్రజలు ఎలాంటి ఆధ్యాత్మిక సేవలను ఆశ్రయించినా, డబ్బులు చెల్లించే ముందు వాటి విశ్వసనీయత, చట్టబద్ధత, వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సామాజిక వర్గాలు సూచిస్తున్నాయి. మరోవైపు ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు దృష్టి సారిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# 12వ డివిజన్‌లో నూతన బహిరంగ వ్యాయామశాల ప్రారంభం



**కరీంనగర్, (సింగిడి):**
కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ బైపాస్ రోడ్డులో సీఎస్ఆర్ నిధులతో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన నూతన బహిరంగ వ్యాయామశాలను ఆదివారం ప్రారంభించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ వ్యాయామశాలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, వాకర్స్, కాలనీవాసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఉచిత రక్తదాన శిబిరానికి స్పందన

**రక్తదానం పై అపోహలు వద్దు**
**ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కనవేన తిరుపతి**



**జమ్మికుంట, (సింగిడి):**
ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హుజూరాబాద్ జమ్మికుంట బ్రాంచ్ ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ కనవేన తిరుపతి అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలోని స్పందన బ్లడ్ బ్యాంక్ లో ఉచిత రక్తదాన శిబిరాన్ని ఐఎంఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 40 మంది యువకులు పాల్గొని రక్తదానం చేసినట్లు హుజురాబాద్ జమ్మికుంట బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూజమ్మికుంట పట్టణంలోని స్పందన బ్లడ్ సెంటర్లో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 40 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని తమ రక్తాన్ని దానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా స్పందన బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని రక్తం దానం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని రక్తదానం చేయడం వల్ల హానికరమైన గుండెపోటు లాంటి రోగాలు రావడం తక్కువగా ఉంటాయని, ఐరన్ యొక్క శాతం తక్కువ కావడం వల్ల బాడీలో కొత్త రక్త కణాలు ఉత్పత్తి అవుతాయని రక్తదానంతో మరొకరిని బ్రతికించవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మేనేజ్మెంట్ రాజిరెడ్డి తోపాటు పటానికి చెందిన పలువురు యువకులు పాల్గొన్నారు.

## రామకృష్ణ కాలనీ, మల్లాపూర్‌లో
# 'స్వచ్ఛ పాఠశాల'

**పాఠశాలల పరిశుభ్రతకు శ్రమదానం చేసిన బీజేపీ శ్రేణులు**



**కరీంనగర్, (సింగిడి):** తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీ, మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో ఆదివారం "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వయంగా శుభ్రత కార్యక్రమంలో పాల్గొ న్నారు. పాఠశాల ఆవరణలోని చెత్తాచె దారం, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చేందుకు కార్యకర్తలు శ్రమదానం చేశారు. ఇంటి తో సమానంగా పాఠశాలలు కూడా పరిశుభ్రంగా ఉండాలని, అప్పుడే విద్యార్థుల కు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుం దని చింతం శ్రీనివాస్ అన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం ద్వారా వారు ఆరోగ్యవంతమైన, బాధ్యతా యుతమైన పౌరులుగా ఎదుగుతా రని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో ఇటువంటి స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని, ప్రజలు స్వచ్ఛందం గా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## దేవాలయాల అభివృద్ధికి గ్రామస్థుల సమిష్టి సంకల్పం

**హుస్నాబాద్ (సింగిడి):**
అక్కన్నపేట మండలం నందారం గ్రామపంచాయతీ ఆవరణలో ఆదివారం గ్రామ పెద్దలు, యు వకులు, వివిధ వర్గాల ప్రతినిధులు సమా వేశమై బొడ్రాయి, దుర్గమ్మ, హనుమాన్ దేవాలయాల అభివృద్ధిపై చర్చించారు. దేవాల యాల నిర్వహణ, నిర్మాణ పనులను సమర్థవం తంగా చేపట్టేందుకు కులాల ప్రాతిపదికన కమిటీ సభ్యులను నియమించారు. అనంతరం దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు. దేవాలయాల అభివృద్ధి గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలవాలని, నియమిత సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామ ప్రజలందరూ సహకరించి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను విజయవం తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

Editorial

## ఆయేషా క్షమించు....!

# కిల్లర్ సేఫ్.... కేసు క్లోజ్.

### న్యాయదేవత సాక్షిగా 19 ఏళ్ల వైఫల్యం..

ఆయేషా హత్యకు గురై 19 ఏళ్లు గడిచింది.. హైకోర్టు నుంచి సుప్రీంకోర్టుకు మారింది ఆయేషా తల్లిదండ్రులకు న్యాయం దొరకలేదు. కేస్ క్లోజ్ అయింది.. హస్తికలీస్తాం పట్టుకెళ్ళండి దహన సంస్కారాలు చేసుకోండి అని కోర్టు చెప్పింది. 19 ఏళ్లుగా సాగిన కేసు విచారణ సిట్ నుంచి సిబిఐ కి మారిన నేరస్తుని పట్టుకోలేక పోయారు. కుటుంబానికి న్యాయం దొరకలేదు.

**ఇంతకు ఆయేషాని చంపింది ఎవరు..?**

ఆయేషా కేసు దాదాపు అందరికీ తెలిసే ఉంటుంది. గుంటూరు జిల్లా తెనాలి మైనార్టీ కుటుంబంలో పుట్టిన ఆయేషా విజయవాడ నిర్మా కాలేజీలో బి ఫామ్ లో చేరింది. ఇబ్రహీంపట్నం దుర్గా హాస్టల్లో స్నేహితులతో పాటు ఉంటుంది. 27 డిసెంబర్ 2027 బాత్రూం రక్తం మడుగులో పడి ఉన్న ఆయేషా ను ఎవరు చంపారో తెలియదు.. ఎందుకు చంపారు కూడా తెలియదు..! అయేషా హత్య కేసు రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. 19 ఏళ్లుగా జరిగిన విచారణలో పోలీసులు ఎందుకు ఫెయిల్ అయ్యారు.. సిబిఐ కోర్టు ఎందుకు చేతులెత్తేసింది? మన వ్యవస్థలు ఎందుకింత నిర్వీర్యమయ్యాయా? పోలీసుల సామర్థ్యాన్ని రాజకీయ ఒత్తిళ్లు తొక్కేశాయ? ఎన్నో అనుమానాల మధ్య తాపీ మేస్త్రి సత్యంబాబును అరెస్టు చేసి చేతులు దులుపుకోవాలని చూశారు. అసలు దోషులను వదిలి అమాయకున్ని అరెస్టు చేశారని ఆయేషా తల్లిదండ్రులు నెత్తి నోరు మొత్తుకున్న వినలేదు. తప్పుడు సాక్షాదారాలతో సత్యం బాబుకు జీవిత ఖైదు పడింది. సత్యం బాబు చేయని తప్పుకు ఎనిమిదేళ్లు జైలు శిక్ష అనుభవించాడు. జైల్లో అతనిపై విష ప్రయోగం జరిగి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. చివరకు నిర్దోషిగా కోర్టు విడుదల చేసింది.. సత్యం బాబు నిర్దోషి అయితే అసలు దోషులు ఎవరు? దోషుల కోసం ఆయేషా డెడ్ బాడీని రెండోసారి పోస్టుమార్టం చేశారు. 20 ఫిబ్రవరి 2026 నా సిబిఐ అధికారులు హంతకులను పట్టుకోలేకపోయామని సిబిఐ కోర్టుకు రిపోర్ట్ ఇచ్చారు. సిబిఐ కోర్టు అయిషా క్లాస్ కేసును క్లోజ్ చేసింది. ఆయేషా దేహంముక్కలకు అంత్యక్రియల తేదీని ఖరారు చేసింది. ఆయేషా కేస్ పర్మినెంట్ గా క్లోజ్ అయింది. సిస్టం ఫెయిల్ అయింది. మనం కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటున్న పోలీసులు చేతకానితనంతో చేతులు దులుపుకున్నారు.



హంతకుడు మన ముందే మన మధ్యలో ఉన్నాడు మన వ్యవస్థ చేతకానితనాన్ని చూసి నవ్వుకుంటూ ఉంటాడు. న్యాయ దేవత సాక్షిగా సాగిన 19 ఏళ్ల వైఫల్యం ఇది. అసమర్థ వ్యవస్థలను చూసి జాలి పడడం తప్ప మనం చేసేదేముంది. వందమంది దోషులు తప్పించుకున్నా సరే ఒక నిర్దోషికి శిక్ష పడకూడదని నానుడి పని చేసిందా నిర్దోషి సత్యంబాబు చేయని తప్పుకు మూల్యం చెల్లించారు.

## భారతదేశంలో హరితవిప్లవం...

# ఆర్థికవ్యవస్థపై దాని ప్రభావం



1960 సంవత్సరంలో భారత దేశ వ్యవసాయ రంగంలో నూతన వ్యవసాయ పద్ధతులు అమలు చేయడం ద్వారా ప్రభుత్వం హరిత విప్లవానికి నాంది పలికింది. ఈ నూతన పద్ధతి 1960 మరియు 1961 వ సంవత్సరంలో ఒక పైలట్ ప్రాజెక్టు రూపంలో దేశంలోని ఏడు జిల్లాలలో ప్రవేశపెట్టారు. ఈ నూతన వ్యవసాయ పద్ధతి సాంద్ర వ్యవసాయ అభివృద్ధి పథకం ఐఏడీపీ గా పిలవబడింది. ఆ తర్వాత కాలంలో అయ్యే డిపి దేశంలోని 114 జిల్లాల్లో అమలు చేయడం జరిగింది .

**భారతదేశ దేశ వ్యవసాయం:**

1960 వ సంవత్సరపు మధ్య భాగంలో ప్రపంచ వ్యవసాయాలు ఒక గొప్ప మార్పును చవిచూశాయి. మెక్సికోకు చెందిన ప్రొఫెసర్ నార్మల్ బోర్లాగ్ అతని అనుచరులు అభివృద్ధి చేసిన అధిక దిగుబడి నిచ్చే వంగడాలు హై హీల్డింగ్ వెరైటీ సీడ్స్ ను ప్రపంచంలోని అనేక దేశాలు ఉపయోగించాయి . హై హీల్డింగ్ వెరైటీ సీడ్స్ ఉపయోగం వల్ల మెక్సికోలో 1965 వ సంవత్సరంలో గోధుమ పంట దిగుబడి 5000 నుండి 6000 కిలో గ్రాములకు పెరిగింది. అదేవిధంగా పెరుగుదల తైవాన్ దేశంలో కూడా సాధ్యపడింది. హై హీల్డింగ్ వెరైటీ విత్తనాలు వరి గోధుమ పంటలలో అధిక దిగుబడికి కారణాలయ్యాయి. వ్యవసాయ రంగంలో ఏర్పడే ఈ విధమైన అద్భుతమైన పెరుగుదల హరిత విప్లవంగా పిలవబడింది. అధిక దిగుబడినిచ్చే వంగడ విత్తనాల ఉపయోగతకు తగినంత నీరు ఎరువులు కీటక నివారణ రసాయనాలు అవసరమవుతాయి. కాబట్టి నిశ్చితమైన నీటిపారుదల వసతి రసాయనక ఎరువుల వాడకంతో పాటు అధిక దిగుబడి నిచ్చే వంగడాలతో సేద్యం చేసి ఎక్కువ దిగుబడులను సాధించడాన్నే హరిత విప్లవం అంటారు.

**భారతదేశంలో హరిత విప్లవం:** భారతదేశంలో హరిత విప్లవం 1966 సంవత్సరం ఖరీఫ్ రుతువు నుండి దేశంలో హరిత విప్లవాన్ని మొదటిసారిగా అమలు పరచడం ప్రారంభించారు. హరిత విప్లవాన్ని వ్యవసాయ అభివృద్ధికి అవలంబించే ఒక నూతన వ్యూహంగా రూపొందించారు. హరిత విప్లవం క్రమబద్ధమైన కావలసినంత సాగునీరు రసాయనిక ఎరువులు క్రిమి కీటకాలను సంహరించే మందులు అధిక దిగుబడించే విత్తనాలతో కూడిన ఒక ప్రత్యేక ప్యాకేజీ ప్రారంభంలో హరిత విప్లవం భారత దేశంలో మొత్తం 1.89 మిలియన్ హెక్టాలలో ప్రవేశ పెట్టడం జరిగింది. 1998 మరియు 1999 నాటికి అధిక దిగుబడినిచ్చే సాగులో ఉన్న మొత్తంభూమి 78.4 మిలియన్ హెక్టార్లు.

**దేశ ఆర్థిక వ్యవస్థపై హరిత విప్లవ ప్రభావం:** అధిక దిగుబడినిచ్చే వంగడాల వల్ల సాంకేతిక విధానాన్ని అవలంబించడం ద్వారా మన దేశ వ్యవసాయ రంగం దిగుమతులు గణనీయమైన పెరుగుదల సాధించింది. గోధుమ ఉత్పత్తి 1969 సంవత్సరంలో 11.1 మిలియన్ టన్నులు అంటే 2008 మరియు 2009 నాటికి 80.86 మిలియన్ టన్నులకు చేరుకుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగినప్పటికీ ముతకధాన్యాలు పప్పు దినుసులు వాణిజ్య పంటలపై అంతగా ప్రభావం చూపలేదు. ఈ విప్లవ కేవలం వరి గోధుమ జొన్నలు బజ్ర మొక్కజొన్నలకే పరిమితమైంది. ఈ విధంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిని నరసన హరితవిప్లవం చెప్పుకోదగ్గ రీతిలో ప్రభావం చేయలేదని విషయాన్ని గమనించాలి.

ఉద్యోగిత: హరిత విప్లవం వల్ల వివిధ రకాల పంటలను సాగు చేసే భూమి ఆహార ధాన్యాల ఉత్పత్తి వ్యవసాయ ఉత్పాదకతలో గణనీయమైన పెరుగుదలకు హరిత విప్లవం తోడ్పడింది. హరిత విప్లవం వ్యవసాయ రంగంలో బహుళ పంటలను ప్రోత్సహించడం ద్వారా ఉద్యోగ అవకాశాలను విస్తరింపజేసింది. అధిక శ్రమ సాంద్రతతో కూడుకున్న పంటలైన వరి చెరుకు బంగాళదుంపలు కూరగాయలు పండ్ల తోటలు వంటివి ఉద్యోగ కల్పనకు తోడ్పడ్డాయి.

**ఆదాయాల్లో పెరుగుదల:**

హరిత విప్లవం ప్రభావంతో కేరళ మధ్యప్రదేశ్ ఆంధ్రప్రదేశ్ తమిళనాడు గుజరాత్ హర్యానా పంజాబ్ హిమాచల్ ప్రదేశ్ తెలంగాణ వంటి రాష్ట్రాల్లో వ్యవసాయ రంగంలో ఆదాయాలు పెరగడానికి హరిత విప్లవం మంచి అవకాశాలను కల్పించిందని పేర్కొనవచ్చు. హరిత విప్లవం పొలాలలోని పంటలను నాణ్యత పరంగా క్రమబద్ధీకరించడం మధ్యలో దళారీల ప్రమేయం లేకుండా నేరుగా కార్పొరేట్ రిటైల్ వ్యాపారస్తులకు అమ్ముకోవడం ఆధునిక సాంకేతిక పరమైన సామాన్య పద్ధతుల్లో తమ ఉత్పత్తులను పెంచుకోవడం గ్రేడింగ్ చేయడం లాంటి అవకాశాలను కల్పిస్తుంది. ఈ విధంగా హరిత విప్లవం భారతదేశంలో లాంటి పెద్ద దేశానికి అన్నపూర్ణ అయిన భారత్ కు ఇదొక గొప్ప వరమనే చెప్పాలి.



**పందిరి శ్రీనివాసులు.**
**ఎంఏ (జాగ్రఫీ), బీఈడీ, ఎంసీజే (జర్నలిజం), పీజీ డీసీజే ( జర్నలిజం) ఉస్మానియా యూనివర్సిటీ.**

# శివపూజకు ఉద్దిష్టమైన దినం

## సోమావతి అమావాస్య

సోమవారం అమావాస్య కలిసి వచ్చే దినాన్ని సోమవతి అమావాస్య అంటారు. ఈ అమావాస్యను మౌని అమావాస్య, శని అమావాస్య అని కూడా పిలుస్తారు. రావిచెట్టులో ఎల్లప్పుడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కొలువుదీరి ఉంటారు. శివుడికి సోమవారం ప్రీతి, సోమవతి అమావాస్య శివ పూజకు ఉద్దిష్టమైన దినం. సోముడు అంటే చంద్రుడు అన్న అర్థం ఉంది. చంద్రుని ధరిస్తాడు కనుక శివుని సోమేశ్వరుడు అని పిలుస్తారు. ఈ రోజున రావిచెట్టుకు శక్తి కొలది పూజించాలి. అమవాస్య అంటే కారు చీకటి మరుసటి రోజునుండి శుక్లపక్షం ప్రారంభం అంటే మన ప్రయాణం పౌర్ణమి అంటే వెలుగు వైపు ప్రయాణం చేస్తుంది. అందుకే అమావాస్య రోజు దైవభక్తితో సత్కార్యాలు చేస్తూ భగవత్ ఉపాసకులు కావాలని సూచిస్తుంది.



దీనికి సంబంధించి పలు కథలు ప్రచారంలో ఉన్నాయి. వాటిల్లో ప్రధానంగా దక్షయజ్ఞం కథ. తన అల్లుడైన శివుని అవమానించేందుకే దక్షుడు ఈ యజ్ఞాన్ని తలపెట్టాడు. అక్కడ తనకి చోటు లేదని శివుడు వారిస్తున్నా వినకుండా శివుని భార్య సతీదేవి ఆ యజ్ఞానికి వెళ్లిం ది. సతీదేవి తన కుమార్తె అన్న ఆలోచన కూడా లేకుండా దక్షుడు ఆమెని కూడా అవమానించాడు. ఆ అవమానాన్ని తట్టుకోలేని సతీదేవి తనని తాను దహించి వేసుకుంది.

సతీదేవి మరణం గురించి విన్న శివుడు ఆగ్రహోదగ్రుడయ్యాడు. తన వెంట్రుకతో వీరభద్రుని సృష్టించాడు. ప్రమథగణాలతో పాటుగా ఆ వీరభద్రుడు దక్షుని మీదకు దాడిచేశాడు. అక్కడ యజ్ఞానికి వచ్చిన వారందరినీ చావచితక బాదాడు. శివగణాల చేతిలో చావుదెబ్బలు తిన్నవారిలో చంద్రుడు కూడా ఉన్నాడు.
చంద్రుడు సాక్షాత్తు శివునికి తోడల్లుడు. అయినా శివుని అవమానించే కార్యక్రమంలో పాల్గొన్నందుకు తగినశాస్తిని అనుభవించాడు.

నిలువెల్లా గాయాలతో నిండిన చంద్రుడు వాటి బాధలకు తాళలేకపోయాడు. తనకు ఉపశమనం కలిగించమంటూ వెళ్లి ఆ పరమేశ్వరుని వేడుకున్నాడు. చంద్రుని బాధను చూసిన భోళాశంకరుని మనసు కరిగిపోయింది. రాబోయే సోమవారంనాడు అమావాస్య తిథి కూడా ఉన్నదనీ... ఆ రోజున కనుక తనకు అభిషేకం చేస్తే చంద్రుని ఆరోగ్యవంతుడవుతాడని అభయమిచ్చాడు. శివుని సూచన మేరకు చంద్రుడు సోమవారం, అమావాస్య కలిసిన రోజున శివునికి అభిషేకం చేసి... తన బాధల నుంచి విముక్తుడయ్యాడు. అప్పటి నుంచి సోమవారం నాడు వచ్చే అమావాస్యను 'సోమవతి అమావాస్య' పేరుతో పిలవడం జరుగుతోంది.

**సోమవతి అమావాస్య**

సోమవారం మరియు అమావాస్య కల్సివచ్చిన రోజున ఆడవారు సౌభాగ్యం కోసం ఈ వ్రతం చేస్తారు. సర్పదోషం ఉన్నవారు, జాతకంలో ఉన్న గ్రహ దోషాలు తొలగి పోవడానికి, అమావాస్య రోజున పెళ్ళి అయిన వారు, పెళ్ళికోసం ఎదిరి చూసేవారు రావిచెట్టుకు పూజా విధానాలతో భక్తి శ్రద్ధలతో 108 సార్లు ప్రదక్షిణలు చేస్తూ పూజించాలి. ఈ రోజున పితృ దేవతలకు పిండ ప్రదానం చేస్తే వారు సంతృప్తి చెంది మేలు చేస్తారని పెద్దలు చెబుతారు. సోమావతి అమావాస్య రోజున శారీరక శక్తి కలిగినవారు ఉపవాసం చేసి శక్తి కొలది పేదలకు, ఆకలితో ఉన్న ఏ జీవరాశులకైన ఆహార పానీయాలు అందిస్తే జాతకంలో ఉండే గ్రహ దోషాలు శాంతిస్తాయని ప్రతీతి. పూజలు ఆర్థిక శక్తి స్థోమత, సామర్థ్యాలను బట్టి చేయాలి తప్ప, అప్పులు చేసి పూజ చేస్తే ఫలితం ఉండదు. ఎద్దైన ధర్మబద్ధమైన కష్టార్జితంతో చేసే దానికే శుభఫలితాలు ఉంటాయి. ఒక అమావాస్యతో కూడిన సోమవారం నాడు నోమును ప్రారంభించాలి. అశ్వత్థ(రావి) వృక్షానికి నమస్కరించి దిగువ శ్లోకాన్ని చదువుతూ ప్రదక్షిణం చెయ్యాలి.

**మూలతో బ్రహ్మరూపాయ... మధ్యతో విష్ణురూపిణే...**
**అగ్రత శ్శివరూపాయ... వృక్షరాజాయతే నమ:**

అలా ఒక్కొక్క ప్రదక్షిణానికి ఒక్కొక్క పర్యాయం చొప్పున 108 సార్లు శ్లోకం చదువుతూ, నూట ఎనిమిది ప్రదక్షిణలు చెయ్యాలి. చివర్లో ఒక పండో ఫలమో చెట్టు మొదలులో ఉంచి నమస్కరించాలి. అలా 108 అమావాస్య సోమవారాలయ్యాక ఉద్యాపన చేసుకోవాలి.
అలా 108 వ అమావాస్యా సోమవారం నాడు రావిచెట్టుకు ప్రదక్షిణలు చేసిన తర్వాత, వృక్షమూలంలో భియ్యంతో మండపం ఏర్పరిచి శ్రీ లక్ష్మీ నారాయణుల విగ్రహాలను ఆ మండపంలో ఉంచి ఆరాధించాలి. ముత్తయిదువలకు ఫలాలను వాయన దానమివ్వాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# చిరుప్రాయంలోనే ప్రజాదరణ పొందిన సంగీత దర్శకుడు చక్రి

ఆత్మ విశ్వాసం, స్వయంకృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అనడానికి సంగీత దర్శకుడు చక్రి జీవితం ఒక ఉదాహరణ. చక్రి అలియాస్ చక్రధర్ జిల్లా (1974 జూన్ 15-2014 డిసెంబర్15) తెలుగు చలనచిత్ర సంగీత దర్శకుడు, రచయిత, గాయకుడు, నటుడు. జూన్ 15,1974న వరంగల్ మహబూ బాబాద్ మండలం కంబాలపల్లిలో జన్మించారు. చక్రికి సంగీత జ్ఞానం అబ్బదానికి కారణం తల్లిదండ్రులే, ఉపాధ్యా యుడైన చక్రి తండ్రి వెంకటనారాయణ కళాకారుడు కూడా. బుర్రకథలు స్వయంగా రాసుకొని ప్రదర్శించేవారు. చక్రి తల్లి విద్యావతి గాయని చిన్నప్పట్నుంచీ చక్రి బాగా పాడేవారు. కొడుకు మనోభీష్టాన్ని గౌరవించి తల్లిదండ్రులు కూడా బాగా ప్రోత్సహించారు. కంబాలపల్లిలో పదవ తరగతి వరకూ చదువుకున్న చక్రి.. అక్కడే ఫ్లూట్ నేర్చుకున్నారు ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ వరకూ మహబూబాబాద్లో చదువుతూ.. అక్కడే వయోలిన్, కర్ణాటక సంగీతం అభ్యసించారు అప్పట్లో మహబూబా బాద్ చుట్టుపక్కల ఎలాంటి కార్యక్రమాలు జరిగినా... చక్రి సంగీత విభావరి ఉండాల్సిందే. చక్రి ట్రూప్ పేరు 'సాహితీ కళాభారతి'. చక్రిని టీచర్ చూడాలనేది తండ్రి ఆకాంక్ష. కానీ... చక్రికి మాత్రం ఉద్యోగాలపై ఆసక్తి ఉండేది కాదు. ఒకరి ముందు చేతులు కట్టుకొని నిలబడలేను అంటూ నిర్మొహ మాటంగా చెప్పేవారు. స్నేహితుల ఒత్తిడి వల్ల చివరకు హైదరాబాద్ బస్సెక్కారు చక్రి. హైదరాబాద్ మహానగరంలో ఏం చేయాలో తెలీక చివరకు పదివేలు ఖర్చు పెట్టి పండు వెన్నెల అనే



మ్యూజిక్ అల్బమ్ చేశారు. పేరైతే వచ్చింది కానీ... డబ్బులు మాత్రం రాలేదు. భుక్తి కోసం ప్రైవేటు ఉద్యోగాలు కూడా చేశారు. ఖాళీ దొరికినప్పుడల్లా ఏదో ఒక ప్రైవేటు ఆల్బమ్స్ చేస్తుండేవారు చక్రి. అలా... మూడేళ్లల్లో 30 మ్యూజిక్ ఆల్బమ్స్ చేశారు. చక్రి జీవితంలో మేలి మలుపు 'చిరునవ్వు ' మ్యూజిక్ ఆల్బమ్. సన ఆడియో వారు చిరంజీవి పుట్టినరోజు ప్రత్యేకంగా ఓ ఆల్బమ్ చేయాలనుకొని చక్రిని సంప్రదిం చారు. స్వతహాగా చిరంజీవి వీరాభిమాని అయిన చక్రి ఆ ఆల్బమ్ చేయడానికి అంగీక రించారు.
చిరంజీవిపాత పాటలనే రీమిక్స్ చేసి, ఆల్బమ్ చేయాలనేది సన ఆడియో వారి ఆలోచన. అయితే... చక్రి తానే స్వయంగా రాసి, స్వర పరుస్తానని చెప్పి, 5పాటలతో 'చిరునవ్వు' అల్బమ్ని రూపొందించారు. ఆఅల్బమ్ విన్న చిరంజీవి... చక్రిని ఎంతో మెచ్చు కున్నారు. చిరు పుణ్య మా అని చక్రికి సినిమా అవకాశాలు రావడం మొదలైంది. పూరి జగన్నాథ్ బాచి (2000) చిత్రంతో సంగీత దర్శకునిగా చక్రి సినీ సంగీత ప్రస్థానం మొదలైంది. ఏ సంగీత దర్శకుని వద్ద సహాయకుగా చేయకుండానే సంగీత దర్శకుడైన ఘనత చక్రికి దక్కుతుంది. ఆ తరువాత పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన అనేక చిత్రాలకు చక్రి దర్శకత్వం వహించారు. అంతకు ముందే పిల్లలు కాదు పిడుగులు చిత్రంలో ఒకపాటకు సంగీతం అందించారు. దేనికైనా రెడీ చిత్రంలోనూ 3పాటలకు చక్రి సంగీతం అందించారు. సత్యం సినిమాకు ఉ త్తమ గాయకుడిగా చక్రి ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. 85 చిత్రాలకు చక్రి సంగీత దర్శకత్వం వహించారు. బాచి సినిమాతో సంగీత దర్శకుడిగా చక్రి తన కెరీర్ను ప్రారంభించారు. సింహా సినిమాకు చక్రి నంది అవార్డు అందుకున్నారు. చక్రి సంగీతం అందించిన చివరి చిత్రం ఎర్రబస్సు. ఇడియట్, అమ్మా నాన్న తమిళ అమ్మాయి, సత్యం, శివమణి, దేశముదురు, గోపి గోపిక గోదారి, నేనింతే, మస్కా సరదాగా కాసేపు, చక్రం, ఆంధ్రావాలా, ఇట్లు శ్రావణి, భగీరథ, ఢీ, రంగ ది దొంగ చిత్రాలకు చక్రి సంగీత దర్శకత్వం వహించారు. చిన్న వయస్సులోనే చక్రి పలు హిట్సాంగ్స్ అందించారు. కొత్త గాయనీ, గాయకులు ఎంతో మందిని చక్రి టాలివుడ్కు పరిచయం చేశారు. శ్రీమన్నారాయణ, జై బోలో తెలంగాణ సినిమాలకు చక్రి సంగీతం అందించారు. తెలంగాణ మలిదశ తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజుల్లో వచ్చిన 'జైబోలో తెలంగాణ' చిత్రానికి ప్రత్యేకస్థాన ముంది. యావత్ తెలంగాణ జాతిని లక్ష్యం వైపుగా కార్యోన్ముఖుల్ని చేసింది. చక్రి కెరీర్లో చేసిన చిత్రాలన్నీ ఓ ఎత్తయితే 'జై బోలో తెలంగాణ' చిత్రం ఒక ఎత్తుగా భావించ వచ్చు. భక్తి సంగీతం సమకూర్చిన సినిమాల్లో అత్యంత ప్రజాధారణ పొందినవి.. ఇడియట్, అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి, సత్యం. తెలుగులోనే కాక తమిళం, కన్నడంలో కూడా చక్రి సంగీతం సమకూర్చాడు. ఆయన సంగీతం అందించిన చివరిచిత్రం విష్ణు మంచు, కేథరీన్ థెరీసా హీరో హీరోయిన్లుగా నటించిన ఎర్రబస్సు. గాయకునిగా కూడా దాదాపు 150 పాటలు పాడారు చక్రి. సత్యం సినిమా కోసం ఆయన పాడిన 'ఓ మగువా నీతో స్నేహం కోసం... 'పాటకు గాయకునిగా ఫిలింఫేర్ అవార్డు అందుకోగా, సింహాకి సంగీత దర్శకునిగా నంది అవార్డు అందుకున్నారు చక్రి. సత్యం, ఎవరైతే నాకేంటి, రంగ ది దొంగ.. తదితర చిత్రాల్లో నటించారు కూడా. చక్రి తండ్రి వెంకట నారాయణ స్ఫూర్తితో తన పుట్టిన రోజైన 'జూన్ 15 'ను వివిధ సేవా కార్యక్రమాలతో జరుపుకునే వారు. రక్తదానాలు, అన్నదానాలు,పండ్లపంపిణీ చేసే వారు. ప్రేమ, ఆధ్యాత్మిక, విషాద గీతా ల్కైనా సంగీతాన్ని స్వరపరిచి సంగీత ప్రియులకు చిరకాలం గుర్తుండి పోయేలా సంగీతంలో తన కంటూ ఒక ట్రేడ్ మార్క్ కలిగిన చక్రి డిసెంబర్14 రాత్రి చక్రికి గుండె పోటు రావడంతో అపోలో ఆసుపత్రిలో చేరి, 2014, డిసెంబర్ 15న తుదిశ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

## తెరుచుకున్న
# తలుపులు



ఎండకు భయపడి మూస్కున్న బడి తల్పులు
నేడు అక్షర ఏరువాకై తెరుచుకున్నయ్
ఇన్ని రోజులు బెంగ పడిన తరగతి గదులు
నేడు సీతాకోకల తోటి తబ్బిబ్బవుతున్నయ్ పసిపిల్లల పాదముద్రలు లేక
గుండె పగిలిన గ్రౌండ్ నేడు థౌజండ్ వాట్స్ బల్బులా వెలిగిపోతుంది

చినుకుతోటి తరువులు చిగురు తొడిగి పుడమిని మురిపెంగా
ముద్దాడుతున్నాయి
పచ్చని ఆకులన్నీ సన్నటి గాలికి ఊగుతూ
బుడ్డలకు స్నేహ హస్తాలను అందిస్తున్నాయి
చెట్ల కొమ్మలు ఊగుతూ తమ భాషలో
పిల్లలకు సలాం చేస్తున్నాయి

ఎర్రటెండలో ట్రైనింగ్‌లో మంచి ముచ్చట్లు
శెవులేసుకొని చిప్ కు మార్పులు చేసుకొని
జ్ఞాన ధారను లేత మనసు పొరల్లోకి
సెలైన్ లా ఎక్కించడానికి గురువులు
బార్డర్ లో సైనికుల్లా బడిలో అడుగిడారు

శుష్కిస్తున్న బడులను బతికించుకోవడానికి
కాళ్ళకు చక్రాలను కట్టుకొని
నెత్తిన సూర్యున్ని పెట్టుకొని
ఎండ తాపానికి గుక్కెడు గుక్కెడు నీళ్లను తాగి బడిబాట లో ఏరుకొచ్చిన
పిల్లలను
ఏ ప్రయివేటు గద్దలు ఎత్తుకపోతాయని
ఒక్కటే పానమంతా గాబరై గుబులైతాంది

రోజుకో మార్పు పూటకో కూర్పు
పైన సర్కార్ ఒత్తిడి కింద టీచర్లకు చిత్తడి
అడిగిందే అడుగుడూ గీసిందే గీసుడూ
గాడి తప్పిన పాలన మెలిపెడుతున్న వేదన
గియాల పంతుల్లు మస్తు పరేశానైతుండ్రు
నాకైతే కాడి కిందెత్తేసి కాగితాన్ని సర్కార్ శేతుల పెట్టేసి సన్నాసులల్ల కల్వ
బుద్ధైతాంది

**-తాటిపాముల రమేశ్ (తార)**
**7981566031**

# సంప్రదాయ శోభలో చైత్ర ఆచార్



కన్నడ ఇతర భాషల్లో ఎదుగుదల: 'తలెదండ' (2022), 'టోబి' (2023) వంటి చిత్రాలలో విమర్శకుల ప్రశంసలు పొందిన నటన, అలాగే 'సప్త సాగరదాచే ఎల్లో సైడ్ బి' (2023)లో 'సురభి'గా ఆమె పోషించిన శక్తివంతమైన పాత్ర ఆమెకు విస్తృత గుర్తింపును తెచ్చిపెట్టాయి. తుపాకి గ్యాలరీ డెస్క్ । 14 జూన్ 2026 సాయంత్రం 5:36. ఆకర్షణీయమైన గులాబీ రంగు లెహంగా, టర్కోయిస్ రంగు దుపట్టా ధరించిన చైత్ర జె. ఆచార్, ఈ అవుట్‌డోర్ ఫోటోషూట్‌లో అద్భుతంగా కనిపిస్తున్నారు. సున్నితమైన ఆభరణాలు, మాంగ్ టిక్కా , హుందా అయిన హావభావాలతో, ఆమె సంప్రదాయ సొగసును ఆధునిక ఆకర్షణతో అద్భుతంగా మేళవించారు. ఈ చిత్రం ఆమెలోని కళాత్మక వైవిధ్యం, సహజ సౌందర్యాన్ని ప్రతిబింబిస్తుంది.

మార్చి 4, 1995న కర్ణాటకలోని బెంగళూరులో జన్మించిన చైత్ర జె. ఆచార్, ప్రధానంగా కన్నడ చిత్రసీమలో పనిచేస్తున్న ప్రతిభావంతులైన భారతీయ నటి మరియు గాయని. ఆమె 'మహిర' (2019) అనే యాక్షన్ థ్రిల్లర్ చిత్రంతో నటిగా అరంగేట్రం చేశారు. బోల్డ్ లెపర్డ్ ప్రింట్ చీరలో నికితా శర్మ వింటేజ్ బాలీవుడ్ గ్లామర్‌ను ప్రదర్శించారు. ముదురు రంగు బ్లౌజ్ , ఆకర్షణీయమైన ఎరుపు రంగు పెదవుల అలంకరణతో కూడిన ఈ బోల్డ్ లెపర్డ్ ప్రింట్ చీర ఫోటోషూట్‌తో ఆమె ఇంటర్నెట్‌లో సందడి చేశారు. 'తలెదండ' (2022), 'టోబి' (2023) వంటి చిత్రాలలో విమర్శకుల ప్రశంసలు పొందిన నటన, అలాగే 'సప్త సాగరదాచే ఎల్లో - సైడ్ బి' (2023)లో 'సురభి'గా ఆమె పోషించిన శక్తివంతమైన పాత్ర ఆమెకు విస్తృత గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఆమె 'బ్లింక్' (2024) మరియు 'గిల్కీ' చిత్రాలలో కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. చైత్ర పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లతో తన పరిధిని విస్తరిస్తున్నారు; సిద్ధార్థ్‌తో కలిసి '3దీఎఖ' చిత్రం ద్వారా తమిళంలోకి అడుగుపెడుతున్నారు మరియు శశికమార్‌తో మరో తమిళ చిత్రం చేస్తున్నారు. ఆమె రాబోయే ప్రాజెక్ట్‌లలో 'మార్నమి' (2025/2026), 'యారిగు హెల్బేడి', 'వృత్త', 'మై లార్డ్' మరియు మహిళా ప్రధాన చిత్రంతో పాటు తెలుగు మరియు ఇతర తమిళ చిత్రాలు ఉన్నాయి. గాయనిగా కూడా రాణిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన చైత్ర, ధైర్యవంతమైన పాత్రలు మరియు ఆకర్షణీయమైన స్క్రీన్ ప్రజెన్స్‌తో మెరుస్తూ, కన్నడ చిత్రసీమలో మంచి భవిష్యత్తు ఉన్న తారగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుంటోంది.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published fromPLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737